

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

# శ్రీ సాయి లీలామృతము

## అధ్యాయము - 3



## శ్రీ సాయి పిలుపు

శ్రీసాయి, శిరిడీకి ఒకవైపున మూడు మైళ్ళలో వున్న రహతాకు, మరో దిక్కున ఒక మైలులోవున్న నీమ్‌గాఁవ్‌కూ తప్ప యెన్నడూ, యెక్కడకూ వెళ్ళలేదు. ఉపన్యాసాలు యివ్వలేదు; ప్రజలను ఆశ్చర్యపరచే చిల్లర మహిమలేవీ ప్రదర్శించలేదు; ప్రశ్నలు చెప్పలేదు. అయినా నానాటికీ బాబా దర్శనం కోసం వచ్చే జనుల సంఖ్య పెరిగిపోతోంది. శిరిడీ గొప్ప తీర్థ క్షేత్రంగా రూపొందుతోంది.; కాని ఆయననెందరు పూజిస్తున్నా, ఆయన మాత్రము పేద ఫకీరుగానే జీవించారు. తాను భగవంతుని బానిసనని, సర్వమూ చేసేది, ఆయన భక్తులను రక్షించేది ఆ భగవంతుడేననేవారు. లేక, అదంతా ఆయన గురువుయొక్క కృపేననేవారు. అయితే ఆయన దర్శనంకోసం అందరు ఎలా వచ్చినట్లు? ఒకప్పుడు ఆయనే చెప్పారు: "నా వద్దకెవరూ వారికై వారే రారు. నేనే అనేక రీతుల వారిని రప్పించుకుంటాను" అని. సాయి, తమ భక్తులను రక్షించడానికే తాము వచ్చామనేవారు. లౌకికమైన కోరికలతో వారిని దర్శించరాదని ఒక భక్తుడు చెబుతుంటే ఆయన, "అలా చెప్పవద్దు : నా వద్దకు మొదట అందరూ అలానే వస్తారు. కోర్కెలు తీరి, స్థాయి చిక్కాక నన్ననుసరించి సన్మార్గానికి వస్తారు" అని చెప్పారు.

వి. హెచ్. ఠాకూర్ ఒక సర్వే బృందంతో కలసి వాడ్గాం వెళ్ళినపుడు అక్కడ దైవవశాత్తు, 'అప్పా' అను కన్నడ మహాత్ముని దర్శించాడు. ఆయన నిశ్చలదాసు వ్రాసిన 'విచారసాగరం' అను గ్రంథాన్ని భక్తులకు బోధిస్తున్నారు. ఠాకూర్‌తో ఆయన, "నీవీ గ్రంథం చదువు, నీ కోరిక ఫలిస్తుంది. నీవు ఉద్యోగంలో ఉత్తరంగా వెళ్ళినపుడు ఒక గొప్ప మహాత్ముడు లభించి, బాట చూపుతారు; సుఖశాంతులు కలుగజేస్తారు" అన్నారు. కొంతకాలానికతడు జున్నర్‌కు బదిలీ చేయబడ్డాడు. అక్కడకు వెళ్ళే మార్గంలో, దున్నపోతునెక్కి నాన్హేఘాట్ అనే పర్వత కనుమ దాటాలి. ఆ ప్రయాణంలో అతని ఒళ్ళంతా హూనమయింది. తర్వాత, అతడు కళ్యాణ్‌లో పనిచేస్తున్నపుడు శ్రీ సాయి గురించి విని శిరిడీ వెళ్ళాడు. బాబాను చూడగానే అతనికి ఆనందభాష్పాలు కారాయి. సాయి అతనికేసి చూచి, "ఆధ్యాత్మ విద్య ఎంతో కష్టము. శక్తినంతా వినియోగించి కృషి చేస్తేగాని ఫలితము వుండదు. అది కన్నడ సాధువు అప్పా చెప్పినంత తేలికకాదు. దున్నపోతునెక్కి నాన్హేఘాట్ దాటటం కంటే గూడ కష్టం!" అన్నారు. ఆ మాటలు ఠాకూర్ ఒక్కడికే అర్థమయ్యాయి. నాడు అప్పా చెప్పినది బాబాను గురించేనని తోచి అతడు మ్రొక్కగానే బాబా ఆశీర్వదించి, "నీకు అప్పా చెప్పినమాట నిజమే. కాని ఆ గ్రంథం చదివితే చాలదు. మననం చేసి ఆచరించాలి. **గురు కటాక్షము, అనుభవజ్ఞానము లేనిదే లాభం లేదు"** అన్నారు.

ప్రొఫెసర్ బాలకృష్ణ ఉపాసని శాస్త్రి యిలా వ్రాశారు; "ఒకప్పుడు పూనాలో ప్లేగు చెలరేగడం వలన చాలా నెలలు మా కళాశాల మూసివేస్తే నా తల్లిని తీసుకొని ఋషికేశ్ దర్శించి, తపోవనం చేరాను. అక్కడ ఒక సాధువు నాకేసి చూచి, 'మీది సటనా గ్రామం గదా?' అన్నారు! వారిని గురించి అడిగితే, రేపు రా చెబుతాను' అన్నారు. ఆ సంగతి విని మా అమ్మగారు ఆయన మా వంశగురువైన ఉద్ధవ మహరాజ్ కావచ్చని చెప్పి, మరురోజు ఆయనను చూడాలని ఆమెగూడ వచ్చింది. (కొన్ని తరాల క్రిందట ఆ వంశస్థులకు గురువైన శ్రీ ఉద్ధవ మహరాజ్ హిమాలయాలకు

వెళ్ళిపోయారు. వారు యోగం ద్వారా చిరంజీవులై, అర్హులైన భక్తులకు దర్శనమిస్తారని చెప్పుకునేవారు.) మరురోజు నేను, మా అమ్మ ఎంత వెదకినా ఆయన కన్పించలేదు. మా అమ్మ బసకు వెళ్ళిపోగానే ఆ సాధువు నా కెదురై, 'ఇలా ఎప్పుడూ చేయకు. ఎవరిని పిలిస్తే వారే రావాలి' అని చెప్పి పూర్వంనుండి మా యింట పూజించబడుతున్న విగ్రహాలు, సాలగ్రామాల గురించి చెప్పారు. వాటిని వారే శ్రీ ఉద్ధవ మహరాజ్‌గారికి యిచ్చామనీ, ఆయన మనవడి నుండి అవి మా తాతాగారికి లభించాయనీ చెప్పారు! (అంటే ఆ సాధువు వయస్సెంత?) 'ఈయనెవరు?' అనుకోగానే ఆయన హిందీలో, 'ఒక చెట్టున్నది. యిద్దరు దానిపైకెక్కారు. ఒకరు క్రిందకూ, ఒకరు పైకీ వెళ్ళారు!' అని, నాల్గు అడుగులు వేసి అదృశ్యమయ్యారు. ఆయన వయస్సు 50 లేక 60 సం॥లు వున్నట్లున్నది. స్థూలకాయుడు. కౌపీనం మాత్రమే ధరించారు.

చాలా సం॥ల తర్వాత నా తమ్ముడు ప్రాణాయామం చేస్తుంటే లోపం జరిగి, అతడు పడుకుంటే శ్వాస ఆగిపోయేది. నిద్ర, జీర్ణశక్తి లోపించి, ఏం చేసినా తగ్గలేదు. చివరకు అతడు యిల్లు విడచి వెళ్ళిపోయాడు. నేను అతనిని వెతకడానికి రైలులో వెళుతుంటే కోపర్‌గాఁవ్‌లో ఒక మిత్రుడు కన్పించి, నేను వెళ్ళే పనిని గురించి విని, బాబాను తప్పక దర్శించమని చెప్పి, నన్నొక టాంగాలో తానే శిరిడీకి పంపాడు. నేను మశీదులోకి వెళ్ళగానే, ధుని దగ్గర తమ చుట్టూ తాము తిరుగుతున్న బాబాను చూచాను. నేను నమస్కరించగానే ఆయన, 'ఖండోబా వద్దకు వెళ్ళు!' అని ఆదేశించారు. నేను బయటకు వచ్చి, ఖంబోబా ఆలయంలో ఒకసాధువున్నాడని విని అక్కడకు వెళ్ళాను. అక్కడున్నది నా తమ్ముడే! అతడు, తాను సాయి ఆజ్ఞానుసారం అక్కడున్నానని చెప్పాడు. నేను మరల మశీదుకు చేరాక, సాయి అందరినీ దక్షిణ అడుగుతూ, నావైపు గూడా చేయి చాపారు. నా దగ్గర డబ్బు లేక, నమస్కారమే దక్షిణగా సమర్పించాను. బాబా హిందీలో, 'ఒక చెట్టున్నది. ఇద్దరు దానిపైకెక్కారు. ఒకరు క్రిందకూ, ఒకరు పైకీ వెళ్ళారు!' అని నవ్వారు. నాకు వెంటనే తపోవన సాధువు గుర్తొచ్చాడు. ఈ యిద్దరికీ పోలికలున్నాయి. కాని శాస్త్రి తపోవనం వెళ్ళే నాటికి బాబా శిరిడీలోనే వున్నారు''.

ముస్లిం మహాత్ములెందరో బాబాపై భక్తితో తమ భక్తులను ఆయన వద్దకు ఆశీస్సులకోసం పంపుతుండేవారు. ఇమాంభాయి చోటేఖాన్‌కు ఉద్యోగంలో చిక్కులొస్తే నాందేడ్‌లోని దర్వేష్‌షా అను ఫకీరును ఆశ్రయించాడు. ఆ సాధువు అతనితో బాబాను దర్శించమని చెప్పి, ఆయన గొప్ప 'ఔలియా' (సిద్ధుడు) అని తెల్పే మార్గం చెప్పాడు: చాటుగా బాబా వెనుకకు జరిగి, మనసులో ఖురాన్‌లోని ఒక మంత్రం వల్లిస్తే ఆయన వెనుకకు తిరిగి అతనిని పలకరిస్తారని, ఆయన పైకమిస్తే మాత్రం తీసుకోవద్దనీ చెప్పాడు. ఇమాంభాయి శిరిడీ చేరేసరికి బాబా ఒక వీధిలో నిల్చోని ఒక భక్తురాలి మొర వింటున్నారు. అతడు దర్వేష్‌షా చెప్పినట్లు చేయగానే బాబా ఆవేశంతో వెనక్కు తిరిగి, "ఎవరు నీవు? నా తండ్రివైనట్లు ఏదో అడగడానికి వచ్చావే!" అని అరచి, అతనిని తిడుతూనే మసీదు చేరారు. రెండు రోజులవరకు అతనిని మసీదులోనికి రానీయలేదు. 'బాబా, అతడూ మీ బిడ్డడే కదా కోపమెందుకు?' అన్నాడు కాకాసాహెబ్. "వాడు నా బిడ్డంటావా? వాడు ఒక టీచరును కొట్టాడు!" అన్నారు బాబా. నిజమే! అతడు పోలీసు, ఒక నేర పరిశోధనలో అతడు ఒక టీచర్‌ను కొడితే ఒళ్ళంతా రక్తంకారి, స్పృహ తప్పి పడిపోయాడు. ఇమాంభాయికి శిక్ష తప్పాలంటే ఉద్యోగం వదలి పారిపోవాలని సాటివారు చెబితే, అతడు సాయిని ఆశ్రయించాడు. అతడు పశ్చాత్తాపం చెందగానే సాయి, "భయపడకు, భగవంతుడే యజమాని!" అని ఆశీర్వదించారు. అతడికెట్టి శిక్షా పడలేదు. తర్వాత ఒకసారి అతడు యింటికి వెళ్ళడానికి సాయి సెలవు యివ్వలేదని ఆరాటపడుతుంటే ఆయన, "వెళ్ళవద్దు. వెళితే గాలివాన, పిడుగులు, నిప్పుకణాలు ఎదురవుతాయి" అన్నారు. అయినా అతడు బయల్దేరి సాయంత్రానికి సురళానది ఒడ్డుకు చేర్రి, కొద్ది దూరం వెళ్ళేసరికి బాగా మబ్బుపట్టి, గాలివాన ప్రారంభమైంది. దారిలో ఒకచోట మఱ్ఱిచెట్టుమీద పిడుగు పడి ఆ చెట్టు కూలింది. అతడు ఆ మెరుపునుండి దృష్టి మరల్చుకోగానే

అక్కడ సాయి, కూడా రెండుకుక్కలు స్పష్టంగా కన్పించాయి. అతడు నమస్కరించాక బాబా అదృశ్యమయ్యారు. ఆ ధైర్యంతో అతడు నది దాటాడు. అవతల ఒడ్డు చేరేదాకా నీళ్ళు మోకాళ్ళ లోతే వున్నాయి! నిజానికి ఆ నది సుమారు ఇరవై అడుగుల లోతుగా గట్లనిండుగా ప్రవహిస్తున్నది. బాబా వాక్కు భగవంతుని వాక్కే!

మోరేశ్వర్ ప్రధాన్ తనకు గల ఒక్క కొడుకు, ఏడు సంవత్సరాల వాడు మరణించడం వలన క్రుంగిపోతుంటే, ఒక మిత్రుడు సాయిని గురించి చెప్పాడు. తర్వాత ఒకరోజు అతనికి కలలో ఏడుగురు సాధువులు కన్పించారు. "మీలో సాయి ఎవరు?" అని అడిగితే, వారు ఒక ఫకీరును చూపారు. తర్వాత అతడు శిరిడీ వెళ్ళి చూస్తే సాయి సరిగా కలలో కన్పించినట్లే వున్నారు. ఆయన అతనిని ఎరుగుదునని చెప్పి, బొంబాయిలోని అతడి యిల్లు, దొడ్లో చెట్లు గూడ వర్ణించారు. తర్వాత అతనిని చూపి "ఎందుకీ పిచ్చివాడు తన కొడుకును నేను చంపానని నిందిస్తాడు? చావడమంటే భూమిలోకి పోవడమే గదా! అంత మాత్రానికే ఎల్లకాలం ఏడుస్తూ కూర్చోవాలా?" అన్నారు.

ఎమ్. డబ్ల్యూ. ప్రధాన్ యింట్లో నిత్యమూ పూజ చేసే మాధవభట్ అనే పూజారికి ఆ దంపతులు ఫకీరైన సాయిని పూజించడం గిట్టేదికాదు. ఒకప్పుడు వాళ్ళ బాబుకు తీవ్రంగా జ్వరమొచ్చి, ఏ మందుకూ తగ్గలేదు. హిందూ దేవుళ్ళ కోపమే అందుకు కారణమని, సాయిని పూజించడం మాననిదే తగ్గదనీ భట్ అన్నాడు. ఆ రాత్రే అతనికి కలలో సాయి, ఆ యింటి మెట్లపై కూర్చొని సట్కాను వూగిస్తూ కన్పించి, "ఏమనుకుంటున్నావ్? ఈ యింటికి యజమానిని నేనే!" అన్నారు. మొదట ఆ సంగతి భట్ ఎవరికీ చెప్పలేదు. అతడెంత జపం చేసినా బిడ్డకు వ్యాధి తగ్గకపోయేసరికి ఒకరోజు అతడు సాయి పటం ముందు నిలచి, "మీరే దత్తాత్రేయులైతే బిడ్డడి వ్యాధి త్వరలో తగ్గాలి" అని ప్రార్థించాడు. కొద్దిసేపట్లో అలానే తగ్గింది. నాటినుండి దత్తాత్రేయుడే సాయియని నమ్మి పూజించసాగాడు భట్.

డి. ఎమ్. ముల్కీ అనే నాస్తికుడు మహనీయుల పటాలు గూడ చూచేవాడు గాదు. అతడి అన్న బాబా భక్తుడు. ముల్కీకి 1916లో తీవ్రంగా జబ్బు చేసి చావు తప్పదన్న భయం కల్గింది. నాటి రాత్రి కలలో, ఒక ఫకీరు కన్పించి, "నా దర్శనానికి వస్తానంటే నీకు జబ్బు తగ్గుతుంది" అని చెప్పి అతడు మాట యివ్వగానే మాయమయ్యారు. అతడు అందుకు భయపడి కేకపెట్టాడు. అతని వదినగారు కారణం తెలుసుకొని, అతడికి బాబా పటం చూపింది, అతడికి దర్శనమిచ్చింది వారే! ఆ రోజే జ్వరం తగ్గింది!! త్వరలో అతడు సాయిని దర్శించాడు. అతనికి కలలో కన్పించింది సాయియే! కస్టమ్స్ శాఖలో పని చేస్తున్న తోసర్‌కు 1895లో ఒకనాటి రాత్రి కలలో ఎవరో మహాత్ముడు కనిపిస్తే, వారినే తన గురువుగా స్మరించుకోసాగాడు. అతడు 1910 లో దాసగణు చేసిన సంకీర్తనలలో బాబాను గురించి విని శిరిడీ వెళ్ళాడు. తనకు స్వప్న దర్శనమిచ్చినది వారేనని గుర్తించాడు. తర్వాత యితడే వాసుదేవానంద సరస్వతీ స్వామి వద్ద సన్యాసం తీసుకొని 'నారాయణాశ్రమ్!' గా ప్రసిద్ధికెక్కాడు.

కోపర్గాఁవ్‌లో 1890 వరకు మమల్తదారుగా వున్న బాలాభాటే, సాయి వట్టి పిచ్చిఫకీరని, అమాయకులు ఆయనను వెర్రిగా పూజ చేస్తున్నారనీ అనేవాడు. ఒకసారి అతని మిత్రులు కొందరు శిరిడీ వెళ్తూ, అతడి విమర్శకు బాధపడి, బాబాను స్వయంగా చూచి మాట్లాడమన్నారు. అతడు గూడ వెళ్ళి శిరిడీలో ఐదు రోజులు వున్నాడు. చివరిరోజున దూరంగా వున్న అతనిని దగ్గరకు పిలచి బాబా అతనిపై ఒక కాషాయం కప్పారు. ఆ క్షణం నుంచి అతడు పూర్తిగా మారిపోయి, అన్నీ విడచి శిరిడీలో వుండిపోయాడు. మిత్రులు ఎంతో కష్టంమీద అతనిచేత ఒక సంవత్సరం ఉద్యోగానికి సెలవు పెట్టించారు కాని తర్వాతగూడ అతడలా వుండిపోయాడు. జిల్లా కలెక్టరు అతనిపై దయతలచి నెలకు రూ. 30/- లు మంజూరు చేసాడు. సాయి తనపై గుడ్డ వేసినప్పటినుండి క్రొత్త జన్మ ఎత్తినట్లయిందని, లౌకిక జీవితం తనకు దుర్భరమయిందని అనేవాడు. అతడు నిత్యకర్మలు ఆచరిస్తూ, సద్గ్రంథాలు

చదువుతుంటే బాబాయే వివరించేవారు.

ఒకసారి వణిలోని సప్తశృంగి దేవాలయం పూజారి కాకాజీకి ఎన్నో కష్టాలు వచ్చాయి. అతడు ఆ దేవిని ప్రార్థిస్తే ఆమె కలలో కనిపించి, 'బాబా'ను దర్శించమని చెప్పింది. నాటికి సాయి ఖ్యాతికెక్కలేదు. ఆమె మాటలు అర్థంగాక, త్రయంబకం వెళ్ళి 10 రోజులు శంకరుణ్ణి సేవించాడు. కాని శాంతి కలుగలేదు. అతడు తిరిగి సప్తశృంగి దేవినే ప్రార్థిస్తే మరల స్వప్న దర్శనమిచ్చి, "నేను చెప్పినది శిరిడీలోని సాయి సమర్థుల గురించి" అన్నది. కాని అతనికి శిరిడీ ఎక్కడున్నదో గూడ తెలియలేదు. ఒకరోజు చిత్రంగా శిరిడీ నుండి శ్యామా అతని వద్దకు వచ్చాడు. ఒకప్పుడు శ్యామా తల్లి శ్యామాకు జబ్బు చేస్తే ఆ దేవికి మ్రొక్కుకున్నది గాని, తీర్చలేదు. అందుకే ఆ కష్టాలు వచ్చాయని ఒక దైవజ్ఞుడు చెప్పాడు. శ్యామా ఆ మ్రొక్కులు బాబాకే సమర్పించబోతే ఆయన, వాటిని వణిలోనే చెల్లించాలని చెప్పారు. అందుకే అతడు వణి వచ్చాడు. బాబా అతనిని తనకోసమే పంపారని తలచి, కాకాజీ గూడ శిరిడీ చేరాడు. సాయిని చూడగానే అతడికి శాంతి లభించింది. సరియైన దేవతారాధన సద్గురువును చూపుతుంది.

షేవడే తన న్యాయశాస్త్ర పరీక్షలకు ముందు సాయిని దర్శిస్తే, ఆయన, "పరీక్షలో పాసవుతావు" అని ఆశీర్వదించారు. అతడు పరీక్ష బాగా రాయలేదు గాని, బాబా మాటనే నమ్ముకున్నాడు. అతడు బాగా వ్రాయకపోతే సాయిగూడ ఏమీ చేయలేరని అతని సహపాఠి సపత్నేకర్ అన్నాడు. కాని షేవడే పాసయ్యాడు. తర్వాత సపత్నేకర్ న్యాయవాదిగా అక్కల్కోటలో స్థిరపడ్డాక అతడి కొడుకు చనిపోయాడు. ఎన్ని యాత్రలు చేసినా ఆ దంపతులకు శాంతి కలగలేదు. అలనాడు షేవడే చెప్పినది గుర్తువచ్చి అతడు సాయిని దర్శించాడు. అతడు నమస్కరించగానే సాయి, "ఫో, యిక్కడినుండి!" అని కసిరారు. అతనిపట్ల బాబాను ప్రసన్నులను చేయగోరి, బాలాషింపీ అను భక్తుడు ఒక సాయి పటం తెచ్చి బాబాకు చూపి, "ఇదెవరిది?" అన్నాడు. ఆయన నవ్వి సపత్నేకర్‌ను చూపుతూ, "అతని ప్రియుడిది!" అన్నారు. అందరూ నవ్వారు. అప్పుడాయనకు నమస్కరించుకోమని షింపీ సైగ చేయగానే సపత్నేకర్ నమస్కరించాడు గాని బాబా మరలా కసిరారు! అతడు నిరాశతో యిల్లుచేరి, మనశ్శాంతి కోసం కాశీ వెళ్ళదలచాడు. ఆ ముందటి రాత్రి అతని భార్యకు ఒక కలవచ్చింది. ఆమె మంచినీటి చెరువుకు వెళ్తుంటే, ఒక చెట్టుక్రింద ఒక ఫకీరు కనిపించి, "అమ్మా, నీకెందుకా బాధ? నీరు నేను తెచ్చిపెడతాను!" అని ముందుకొచ్చాడు. ఆమె భయంతో పారిపోతుంటే అతడు వెంట వచ్చాడు. అది తమను శిరిడీ రమ్మన్న సందేశమని తలచి ఆ దంపతులు శిరిడీ చేరారు. అప్పుడే లెండీనుండి వస్తున్న బాబాను చూస్తూనే, తనకు స్వప్నంలో కనిపించినది వారేనని ఆమె గుర్తించింది. తర్వాత మశీదు చేరాక సాయి, "అమ్మా, ఎంతో కాలంగా నా చేతులు, కడుపు, నడుము నొప్పి పుడుతున్నాయి. ఈ క్షణంలో చిత్రంగా తగ్గిపోయాయి!" అని ఎంతో మధురంగా నవ్వారు. నిజానికి, అలా జరిగినది ఆమెకే!! తానడుగకనే తన బాధలను గుర్తించి తొలగించిన ఆయన శక్తికి ఆమె ఆశ్చర్యపోయింది. కాని సపత్నేకర్ నమస్కరించుకోగానే బాబా కసిరారు. గతంలోని తన తప్పిదాలకే బాబా కసురుకున్నారని గుర్తించి, మశీదులో ఆయన ఒక్కరే వున్నప్పుడు వెళ్ళి శరణు వేడాడు. ఈసారి ఆయన ప్రేమతో తల నిమిరారు.

ఇంతలో ఒక గొఱ్ఱెల కాపరివచ్చి, బాబాకు నడుము పిసకనారంభించింది. ఆమెతో బాబా ఒక వర్తకుని కథ చెప్పారు. అది సపత్నేకర్ కథే! చివరికి అతనిని చూపి, "నేను తన బిడ్డను చంపానని వీడు నన్ను నిందిస్తున్నాడు. నేనలా చంపుతానా? ఈ మశీదులో కాలుపెట్టాక గూడ యింకా దుఃఖిస్తాడెందుకు? మరలా ఆ బిడ్డనే ఆ తల్లి గర్భంలో వుంచుతాను!" అన్నారు. అతడు నమస్కరించగానే, "ఆద్యంతాలు లేని యీ పాదాలు పరమ పవిత్రమైనవి, నాపై పూర్తి విశ్వాసముంచు, నీ కోరిక నెరవేరుతుంది" అన్నారు. మర్నాడు అతడు జనంలో త్రోసుకు వస్తుంటే చూచి, "హృదయ పూర్వకమైన ఆ నమస్కారమొక్కటే చాలు, ఎందుకిన్నిసార్లు?" అన్నారు బాబా. భక్తిని నిలుపు

కొనడమే నిజమైన నమస్కారము. చివరకు వాళ్ళు శెలవు కోరినప్పుడు అతనికొక కొబ్బరికాయ యిచ్చి, "ఇది నీ భార్యకివ్వు! సంతోషంగా బయల్దేరండి" అని ఆశీర్వదించారు. సంవత్సరంలోగా వారికి కొడుకు పుట్టాడు.

బాలక్‌రామ్‌మాన్కర్, తన భార్య గతించాక శిరిడీలో వుండిపోయాడు. ఒకరోజు బాబా అతనికి రూ.12/-లు యిచ్చి మత్స్యేంద్రనాథుడు తపస్సు చేసిన మచ్ఛేంద్రగడ్‌లో కొంతకాలముండమని చెప్పి, "అక్కడ గూడ నీకు దర్శనమిస్తాను" అన్నారు. అతడు మచ్ఛేంద్రఘడ్ వెళ్ళాక, ఒకనాడు ధ్యానమయ్యాక, సాయి అతనికి భౌతికంగా దర్శనమిచ్చారు. అతడు నమస్కరించుకోగానే ఆయన, "కేవలం నేను యీ దేహమేననుకుంటున్నావు. భక్తుడెక్కడ స్మరిస్తే అక్కడ నేనున్నానని తెల్పడానికే నిన్నిక్కడకు పంపాను" అని చెప్పి అదృశ్యమయ్యారు. కొంత కాలానికి శిరిడీ బయల్దేరిన మాన్కర్‌కు పూనా రైల్వేస్టేషన్‌లో రద్దీవలన టిక్కెట్టు దొరకలేదు. ఇంతలో ఒక వ్యక్తి, తమవద్దనున్న టికెట్టు అతనికిచ్చి, పైకమిచ్చేలోగా అదృశ్యమయ్యాడు.

లాలా లక్ష్మీచంద్‌కు 1910లో ఒకరోజున కలలో గడ్డమున్న ఒక వృద్ధ ఫకీరు, ఆయన చుట్టూ భక్తులు కనిపించారు. ఒకసారి హరికథ చెబుతున్న దాసగణు ప్రక్కన బాబా పటం చూచి, తనకు దర్శనమిచ్చినది వారేనని గుర్తించాడు. సాయిలీలలు విని అతడు శిరిడీ వెళ్ళాలనుకుంటుంటే మిత్రుడు శంకర్రావు అతనిని గూడ శిరిడీ రమ్మని పిలిచాడు. లక్ష్మీచంద్ రూ. 15/-లు అప్పు తీసుకొని బయల్దేరాడు. రైలులో కొందరు భక్తులతో కలసి, వీరుగూడ భజన చేసారు. తర్వాత శిరిడీకి చెందిన ముస్లింలు కనిపిస్తే వారిని బాబా గురించే అడిగాడు. లక్ష్మీచంద్ శిరిడీ చేరాక సాయి అతనిని చూపి, "వీడెంత టక్కరి! ఒకవంక భజన చేస్తూనే నన్ను గురించి యితరులను అడుగుతాడు. ఏదైనా మనమే చూచి తెలుసుకోవాలి" అని అతనితో, "నీ కల నిజమైందా లేదా? అప్పుచేసి శిరిడీ రావడమెందుకు?" అన్నారు.

ఒకసారి మద్రాసునుండి కాశీ వెళ్తున్న భజన బృందం సాయిని దర్శించి భజన చేసారు. అందరూ బాబాయిచ్చే కానుకలకోసం చేస్తే, లక్ష్మి అనే ఆమె మాత్రం భక్తితో చేసింది. నాటి మధ్యాహ్నం సాయి ఆమెకు శ్రీరాముడిగా దర్శనమిచ్చారు. కాని అది ఆమె భ్రమేనని ఆమె భర్త గోవిందస్వామి అన్నాడు. నాటి రాత్రి అతనికొక చిత్రమైన స్వప్నం వచ్చింది, అతనికి పోలీసులు సంకెళ్ళు వేస్తుంటే సాయి చూస్తున్నారు. అతడు తనను రక్షించమంటే, పాపమనుభవించక తప్పదన్నారు బాబా. ఆ పాపాన్ని దహించి వేయమని అతను కోరాడు. అతనికంత విశ్వాసముంటే కన్నుమూసి తెరవమన్నారు సాయి. అలా చేయగానే అతడు విడుదలై, పోలీసులు చచ్చిపడియున్నారు. అతడు సాయి చేసిన మేలు మరచి సంతోషిస్తుంటే బాబా, "వీరిని చంపినందుకు శిక్షపడుతుందిలే!" అన్నారు. అతడు భయంతో బాబా కాళ్ళు పట్టుకున్నాడు. ఆయన అతనిని మరొకసారి కన్నులుమూసి తెరవమన్నారు. అలా చేసేసరికి అతడి ఆపద తొలగిపోయింది. కృతజ్ఞతతో అతడు నమస్కరించగానే, "మొదటి నమస్కారానికీ దీనికీ భేదమున్నదా?" అన్నారు బాబా. మొదట ఆయన ముస్లిం అన్న శంకతోను, కాన్కలపై ఆశతోను, యీసారి విశ్వాసంతోనూ నమస్కరించానన్నాడతడు. "నీవు చాటుగా పంజా, తబూత్ వంటి ముస్లిం ప్రతీకలను పూజిస్తావు గదా?" అడిగారు బాబా. అతడు సిగ్గుపడి తన గురువైన సమర్థ రామదాసస్వామి దర్శనం కోరాడు. సాయి అతనిని వెనుకకు తిరిగి చూడమన్నారు. చూస్తే అక్కడ ఆ స్వామి కనిపించి అతడు నమస్కరించాక అదృశ్యమయ్యారు. అప్పుడతడు, "బాబా, మీరెంతో వృద్ధులు. మీ వయస్సెంత?" అన్నాడు. "ఏమిటి, నేను వృద్ధుడినా? నాతో పరిగెత్తు చూస్తాను!" అని సాయి పరుగెత్తి అదృశ్యమయ్యారు. అంతటితో అతనికి బాబాపై భక్తి కలిగింది. ఈ కలలోని బోధయే ఆయనిచ్చే అసలైన కానుక.

★★★